నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

సర్టిఫికెట్ల పరిశీలనకు ఈ రోజూ చాన్స్

- కొనసాగుతున్న డీఎస్సీ 2008 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

రామగిరి, సెప్టెంబర్ 28 : డీఎస్సీ 2008కి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో కొనసాగుతున్నది. జిల్లా వ్యాప్తంగా 391 మంది ఎంపికైనట్లు డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు వెబ్‌సైట్‌లో జాబితాను అందుబాటులో ఉంచగా.. శుక్రవారం 96మంది, శనివారం 28మంది అభ్యర్థులు కలిసి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్నట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు. అక్టోబర్ 5 వరకు పరిశీలన కొనసాగుతుందని చెప్పారు. జాబితాలోని అభ్యర్థులు విధిగా హాజరువాలని సూచించారు. నేడు ఆదివారం కూడా మధ్యాహ్నం వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు.

అక్టోబర్ 1న డీఈఈ సెట్ సర్టిఫికెట్ పరిశీలన

రామగిరి, సెప్టెంబర్ 28 : డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమో ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన డీఈఈ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన అక్టోబర్ 1న నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ కానుగుల నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2024లో నిర్వహించిన సర్టిఫికెట్ పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులు మాత్రమే డైట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటలకు హాజరై సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, కులం, ఆదాయం, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని తెలిపారు.

కాంగ్రెస్‌లో కరపత్రాల యుద్ధం

గుండాలలో రచ్చకెక్కిన విభేదాలు

- మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి చుట్టూ రాజకీయం
- మండలవ్యాప్తంగా రాత్రికిరాత్రి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల పేరుతో కరపత్రాలు
- డీసీసీ అధ్యక్షుడు సొంత మండలంలో కుమ్ములాటలు


కాంగ్రెస్ కార్యకర్తలారా ఆలోచించండి.

కాంగ్రెస్ గుండాల మండల కార్యకర్తలారా, నాయకులారా ఆలోచించండి. ఈ నెల 20న మన పార్టీపై వ్యవహరిస్తూ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి D.S. వర్గానికి మన గుండాల మండలాని కేటాయించడం జరిగింది. గత పది మండలాలను అభివృద్ధి కోసమంటూ కొందరు కాంగ్రెస్‌పార్టీ మంచి TRSలోకి చేరినవి వచ్చిన పార్టీని నమ్మకుండా, పార్టీ జండాలతో పార్టీ కార్యక్రమాలలో పాల్గొని 10 మండలాలలో పార్టీ కష్టాలలోవున్న గ్రామాలలో కాంగ్రెస్ మంచి పట్టిన నాయకులకు, కార్యకర్తలకు వ్యవహరిస్తూ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలి. అని గత ఆరు నెలలుగా పార్టి ఎత్తక్షణ మండల అధ్యక్షులు వర్గీయ సమస్యతో హైదరాబాద్ మంచి పట్టిన నాయకులు ఇవ్వాలని అలోచన జరుగుతూ మన పార్టీకి వ్యవహరిస్తూ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మనమేమంతం చేసిన మండలాలకు గారికి ఇవ్వకుండా జరిగింది.

మీరికి పుష్క అర్హతలు:-

1. తల్లా అధ్యక్షులు శ్రీ అంబేడ్కర్ సంతోష్‌రెడ్డి గారికి చోటు
2. శ్రీ మంచాల సామేల్ MLA గారికి ఇన్ చార్జి మండల్
3. శ్రీ భీర్ల అయిలయ్య MLA గారికి చోటు
4. మీరు పార్టీ కష్టాలలో ఫుల్ ఆరు హైదరాబాద్‌లో వ్యాపారాలు చేసుకుంటూ హైదరాబాద్ స్థిరపడ్డారు.
5. మనమంతా కాంగ్రెస్ కార్యకర్తలు ఆలోచించండి. పార్టీని నమ్మి గ్రామంలో వున్న నాయకులు, కార్యకర్తలు అభివృద్ధికోసం. పార్టీని నమ్మండి, నమ్మకాన్ని నమ్మండి, నమ్మి పార్టీ మీదా పట్టండి. నాయకులు లాగానే మండలంలోని మండలం, అలాంటాలు కష్టపడి.
6. పార్టీకి కిందాలాయాలు, నాయకులకు మనలాంటి అభ్యర్థులకే పదవులు పట్టాలి.
7. నాయకులు పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తలకు తగురీతి కేటగిరీలకు. పార్టి అనుచరులుగా తయారుచేస్తుకుంటున్నారు.

చదువుకుంటూ బట్టి బయటవాలు కాంగ్రెస్ కార్యకర్తలు ఆలోచించాలని కోరుకున్నాము.

నోటీ: మీరిచ్చే మండలాలు, రాష్ట్ర నాయకులు, తల్లా నాయకులు పరిశీలి ఆలోచించగలరని ప్రార్థిస్తున్నాము.

ఇట్లు

గుండాల మండల కాంగ్రెస్ పార్టి నాయకులు, కార్యకర్తలు

గుండాల మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల పేరుతో వెలిసిన కరపత్రం

గుండాల, సెప్టెంబర్ 28 : గుండాల కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా శుక్రవారం రాత్రి మండల వ్యాప్తంగా కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పేరుతో అదే పార్టీలోని మరో వర్గాన్ని విమర్శిస్తూ పెద్దఎత్తున కరపత్రాలు కనిపించాయి. అన్ని గ్రామాల్లోని కూడళ్లు, రచ్చబండల వద్ద వీటిని పడేశారు. గుండాల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తీవ్రమైంది. హైదరాబాద్ నుంచి సమయానికి వచ్చి రాజకీయం చేసే కొందరు నాయకులకే పదవులు ఇస్తున్నారని కరపత్రాల్లో పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి అనుచరులు అయిన నూనెముంతల విమలావెంకటేశ్వర్లుకే మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. మొదటి నుంచి పార్టీ జెండాను మోసిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీలో ఐదారు గ్రూపులు తయారై అసలైన కార్యకర్తలను కాకుండా వర్గాలను ప్రోత్సహిస్తున్నారని గ్రూపు రాజకీయాలను బహిర్గతం చేశారు. గతంలో పదవుల కోసం ఆశపడి ఇతర పార్టీల్లో చేరిన నాయకులు ఎన్నికల ముందు వచ్చి చేరి ఎమ్మెల్యే, మంత్రుల వద్ద తామే లీడర్లమంటూ కలరింగ్ ఇస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గుండాల మండల పర్యటనలు సైతం హైదరాబాద్ నుంచి రాజకీయం చేసే నాయకులే డిసైడ్ చేస్తున్నారని, మండల, గ్రామ స్థాయిలో కనీస సమాచారం ఉండడం లేదని పేర్కొన్నారు. ఈ కరపత్రాల వ్యవహారం సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యింది. కాగా, మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఆశించి భంగపడ్డ నాయకులే కరపత్రాలు వేయించారని ఆ పార్టీ నాయకులు కొందరు అనుమానం వ్యక్తం చేశారు. మరికొందరు మాత్రం ఎవరు చేసినా ఉన్నది ఉన్నట్లు చెప్పారంటూ మద్దతు పలుకుతున్నారు. డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి సొంత మండలంలో ఈ వర్గ విభేదాలు చర్చనీయాంశంగా మారాయి.

సద్దుల చెరువు కింది ప్రాంతం ఎఫ్‌టీఎల్ పరిధి కానే కాదు

ప్రభుత్వ బాధ్యతారాహిత్యంతో స్థానికుల్లో భయాందోళనలు

- సర్కారు తొందరపాటు నిర్ణయం తీసుకుంటే ఇబ్బందులు తప్పవు
- ప్రాణం పోయినా ఈ దుర్మార్గాన్ని ఆపి తీరుతా
- సూర్యాపేట 30, 42, 43 వార్డుల్లో పర్యటించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- మీరే కాపాడాలంటూ వేడుకున్న ప్రజలు
- నేనున్నానంటూ ధైర్యం చెప్పిన గుంటకండ్ల

సద్దుల చెరువు కింది ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెబుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 28 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు కట్ట ప్రాంతం కట్ట కంటే కిందికి ఉంటుందని, టెక్నికల్‌గా ఇది ఆనాడు ఎఫ్‌టీఎల్ అని పడి ఉంటుంది తప్ప వాస్తవంలో ఆ పరిస్థితి లేదని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. ఎఫ్‌టీఎల్ పేరుతో మార్కింగ్‌లు ఇస్తూ ప్రజలను ఎందుకు భయపెడుతున్నారని ప్రశ్నించారు. తన ప్రాణం పోయినా ఈ దుర్మార్గాన్ని ఆపి తీరుతానని స్పష్టం చేశారు. నాలుగు రోజుల నుంచి సద్దుల చెరువు ప్రాంతాల్లో అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ సర్వే చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతుండడం తెలుసుకున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి శనివారం వారి నివాసాల వద్దకు వెళ్లి భరోసానిచ్చారు. 30, 42, 43వ వార్డుల్లో పర్యటించి నేనున్నానంటూ ప్రజలకు ధైర్యం చెప్పారు. జగదీశ్‌రెడ్డిని చూసి స్థానిక ఒక్కసారిగా దుఃఖం వెల్లదీస్తూ తమ బాధను వినిపించారు. అప్పట్లో ఎంత కష్టం చేసి భూములు కొన్నది, ఇండ్లు కట్టుకున్నది వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పందిస్తూ.. ఇక్కడి పరిస్థితులపై తనకు అవగాహన ఉందని, మీ ఇండ్లకు ఏమీ కాదని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలోని 30, 42, 43వ వార్డులు సద్దుల చెరువు కింది ప్రాంతాలు అని, ఇక్కడ చెరువు కట్టను కూడా ప్రభుత్వమే నిర్మించిందని తెలిపారు. ఇక్కడికి ఎన్నడూ ఒక చుక్క నీరు రాలేదని, స్థానికంగా మూడు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వాటిని మించి 500 మీటర్ల వరకు ఇండ్లు కూలగొడుతామంటే ఊరుకునేది లేదన్నారు. ఇక్కడ ఇండ్లను కూలగొడితే వెయ్యి కోట్లకుపైగా నష్టం వాటిల్లుతుందని, ఇది నీరు నిలిచే ప్రాంతం కాదని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ కట్ట కంటే పైకి ఉంటుందని, కానీ ఈ ప్రాంతం కట్టకు దిగువన ఉంటుందని తెలిపారు. టెక్నికల్‌గా ఆనాడు ఎఫ్‌టీఎల్ అని పడి ఉంటుంది తప్ప వాస్తవానికి ఎఫ్‌టీఎల్ పరిధి కాదని వివరించారు. మార్కింగ్ ఇస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తామంటూ చూస్తూ ఊరుకోబోమన్నారు. ఇక్కడి ప్రజలు భూమి కొనుక్కొని గుడిసెలు వేసుకుని ప్రభుత్వానికి డబ్బు రిజిస్ట్రేసన్ చేయించుకున్నారని తెలిపారు. నాడు 'మేం ప్లాట్లు కొని మోసపోయాం. ఎవరో వచ్చి మాది అంటే కొన్నామని చెప్తే.. అధికారులు ఎవరి దగ్గర కొన్నది మాకు తెల్వదు.. ప్రభుత్వానికి డబ్బు కడితే రిజిస్ట్రేషన్ చేస్తామంటే తిరిగి రెండోసారి డబ్బు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు' అని గుర్తు చేశారు. ఇక్కడ ప్రతి ఇంట్లో శ్రమజీవుల కష్టం ఉందని, చిన్న చిన్న గుడిసెలు వేసుకుని అప్పుడింత అప్పుడింత ఇల్లు కట్టుకుంటే.. ఇప్పుడు హైడ్రా పేరుతో కూల్చివేతలకు పాల్పడుతామంటే.. ఆ దుర్మార్గాన్ని సాగనివ్వనన్నారు. సూర్యాపేట ఎమ్మెల్యేగా ప్రాణం పోయినా ప్రజల వెంట ఉండి ఈ దుర్మార్గాన్ని ఆపుతానన్నారు. ఏ సుప్రీంకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దుర్మార్గం చేస్తుందో.. అక్కడికి కూడా వెళ్తామన్నారు. తప్పు మీరు చేసి ప్రజలు శిక్ష వేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. సర్కారు బాధ్యతారాహిత్యంతో ప్రజలకు కంటి మీద కనుకు కరువైందని, ప్రభుత్వం ఇలాంటి పనికిమాలిన పనులు ఆపి ఒక శాస్త్రీయమైన నిర్ణయం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న చెరువులు, కుంటలు, నాలాల ఎఫ్‌టీఎల్ బఫర్‌ను నిర్ణయించాలన్నారు. అనంతరం అక్కడి పరిస్థితులను బట్టి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజలకు నష్టం జరిగేందుకు కారణం ప్రభుత్వ శాఖలే అయినప్పుడు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తాను ఎమ్మెల్యే అయ్యాక సూర్యాపేటలోని మూడు మూడు చెరువుల్లో ఎఫ్‌టీఎల్ లెవల్‌లో నీరు నిలబెట్టి భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలూ రాకుండా ఎక్కడా నూతన నిర్మాణాలు జరుగకుండా చేశానన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏదైతే మార్కింగ్ పెట్టమని చెప్పిందో ఆ ప్రాంతం ఎఫ్‌టీఎల్ కానే కాదని చెప్పారు. ఈ విషయంలో తొందరపాటు నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కలెక్టర్‌ను కలిసి వివరిస్తానన్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వెంట మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్ పల్స మహాలక్ష్మి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు బత్తుల రూన్సీ, బీఆర్ఎస్ నాయకులు అంగిరేకుల నాగార్జున, రమేశ్ ఉన్నారు.

లోక్ అదాలత్ లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు

లోక్‌అదాలత్‌లో 11,066 కేసులు పరిష్కారం

- రాజీ మార్గంతో కుటుంబ శ్రేయస్సు, ఆర్థిక ప్రగతి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 28 : రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. భువనగిరిలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. న్యాయ సేవ అధికార సంస్థ చట్టం ద్వారా ప్రజలకు ఉచిత న్యాయం, న్యాయ విజ్ఞానం అందించడమే గాక చిన్నచిన్న తగాదాలను రాజీ చేసుకొని స్నేహపూర్వక వాతావరణంలో జీవించేందుకు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సివిల్ కేసులను త్వరగా పరిష్కరించుకుంటే కుటుంబ శ్రేయస్సుతో పాటు ఆర్థిక ప్రగతి బాగుంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా 9 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేయగా.. 3,459 క్రిమినల్ కేసులు, 17 సివిల్ కేసులు, 7,517 ట్రాఫిక్ చలానా కేసులతోపాటు ప్రీ లిటిగేషన్ కేసులు, టెలిఫోన్ రుణ బకాయిలు, ఎస్‌బిఐ కేసులను కలిపి మొత్తం 11,066 పరిష్కరించినట్లు తెలిపారు. కేసుల పరిష్కారంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు యంత్రాంగం కృషిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవి లత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్ రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.హరినాథ్, ఉపాధ్యాక్షుడు కె.జయ, లోక్ అదాలత్ సభ్యులు రేణుక, రజిని, నాగేంద్రమ్మ, జనార్ధన్, ప్రభుత్వ న్యాయవాదులు, ఏపీపీలు సౌజన్య, చంద్రశేఖర్, న్యాయ సహాయ న్యాయవాదులు ఎస్.జయపాల్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే జెండగే

ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

- ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- కలెక్టర్ హనుమంతు కే జెండగే

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ : ధరణి దరఖాస్తులలో అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కే జెండగే ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం రెవెన్యూ డివిజనల్ అధికారులు, తాసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో ధరణి, ప్రజావాణి దరఖాస్తులు, వాల్టా చట్టంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి ఫైళ్ల పరిష్కారం క్వాలిటీతో పూర్తి కావాలని, రిమార్క్‌లు, రికమెండేషన్లు క్లియర్‌గా ఉండాలని సూచించారు. ప్రతి దరఖాస్తునూ సంబంధిత సర్టిఫికెట్లతో ఫైల్స్ సర్క్యులేట్ చేయాలని ఆదేశించారు. ప్రజలు, విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో జాప్యం ఉండొద్దన్నారు. రాష్ట్ర స్థాయి ప్రజాభవన్ నుంచి వచ్చిన సమస్యలు, జిల్లా స్థాయిలో వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలన్నారు. మండలాలలో కొత్తగా గుర్తించిన విద్యుత్ సబ్ స్టేషన్లు, హెల్త్ సబ్ సెంటర్లకు స్థలాలను గుర్తించాలని తాసీల్దార్లకు సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణ వాల్టా చట్టంపై గ్రామాలు, అర్బన్ ప్రాంల్లో అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, జిల్లా భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ జీఓ 25 నిబంధనలు మార్చాలి

- కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల ధర్నా

కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యూపీఎస్‌సీ నాయకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 28 : రేషన్‌లైజేషన్ జీఓ నెంబర్ 25 నిబంధనలను మార్చాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూపీఎస్‌సీ) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు సిలివేరు మహేశ్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు ముక్కెర్ల యాదయ్య అన్నారు. జీఓ నిబంధనలు మార్చాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి జగన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశాస్త్రీయమైన జీఓ 25 అమలు చేయాలని పాఠశాల విద్యా సంచాలకులు జిల్లా కలెక్టర్లను ఆదేశించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రాథమిక పాఠశాలలో 11మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 60మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని పేర్కొనడం అసంబద్ధమైన విషయమని పేర్కొన్నారు.

ఇటీవల జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల్లో పాఠశాల విద్యా శాఖ పాటించిన నిబంధనలను అమలు చేయడకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా, 40 మంది వరకు ఇద్దరు, 60 మంది వరకు ముగ్గురు, ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడి చొప్పున కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించి ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరారు. నేటి సామాజిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని ఉన్నత పాఠశాలల్లో ప్రతి 25మంది విద్యార్థులను ఒక సెక్షన్‌గా పరిగణించి ప్రభుత్వ ఉత్తర్వులు 25ను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూపీఎస్‌సీ నాయకులు మెతుకు సైదులు, ఎన్.లక్ష్మీనర్సింహారెడ్డి, కె. శ్రీనివాస్, ఎస్.భాస్కర్, కృష్ణమూర్తి, జీవీ రమణారావు, లింగయ్య, జి.బాలయ్య, జె.కరుణాకర్, పి.గోపాలకృష్ణ, ఎస్.పరమేశం, బి.నర్సిరెడ్డి పాల్గొన్నారు.

తపాసుపల్లి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

తపాసుపల్లి నుంచి సాగు నీరు అందిస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రాజాపేట, సెప్టెంబర్ 28 : తపాసుపల్లి ప్రాజెక్ట్ ద్వారా రాజాపేట మండలానికి సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. రాజాపేట మండలానికి తలాపున ఉన్న తపాసుపల్లి ప్రాజెక్ట్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాసుపల్లి ప్రాజెక్టు నీళ్లతో త్వరలోనే బొందుగుల, సోమారం, కొలనుపాక చెరువులు నింపుతామన్నారు. తపాసుపల్లి ప్రాజెక్ట్ కింద ఉన్న ఆయకట్టు రైతులు, అధికారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట మార్కెట్ డైరెక్టర్లు సిల్వేరు బాలరాజుగౌడ్, మాడోతు విఠల్‌నాయక్, నాయకులు ప్రవీణ్, పెంటయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి. ప్రవీణ్‌కుమార్, నరేశ్, కనకరాజు, నవీన్‌కుమార్, రాంజీనాయక్, రమేశ్, యాదేశ్, పాండు ఉన్నారు.

మాట్లాడుతున్న దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సులోచన

ఆలయాల్లో నిత్యం ధూప, దీపాలు నిర్వహించాలి

- ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన

రామగిరి, సెప్టెంబర్ 28 : ధూప, దీప, నైవేద్య పథకంలోని ఆయాలల్లో పనిచేసే అర్చకులు విధిగా నిత్యం ఆయా ఆలయాల్లో ధూపం, దీపం నిర్వహించాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ అన్నెపర్తి సులోచన స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని టీఎన్‌జీఓ భవనంలో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు జనగామ జిల్లాలోని ధూప, దీప నైవేద్య పథకం అర్చకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు చేపడితే అనుమతి తీసుకోవాలన్నారు. దేవాలయాలకు దాతలు అందించే విలువైన వస్తువుల, భూముల వివరాలను ఎప్పటికప్పుడు దేవాదాయ శాఖకు తెలుపాలని సూచించారు. ఆయా దేవాలయాలను 43(10) కింద రిజిస్టేషన్ చేసుకోవాలన్నారు. దేవాదాయ శాఖ అమలు చేసే ప్రతి కార్యక్రమంలో డీడీఎన్ అర్చకులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలాతాబాద్ వాసుదేవశర్మ, చెర్వుగట్టు దేవస్థానం ప్రధానార్చకుడు డాక్టర్ పోతులపాటి రామలింగేశ్వర్శర్మ, దేవాదాయ శాఖ సూపర్‌వైజర్లు బి.సుమతి, వెంకటలక్ష్మి, అధికారులు, సిబ్బంది నీరుడు సంతోశ్‌రెడ్డి, నల్లగొండ నిఖిల్, శైలోజు జ్యోతి, పూర్ణచందర్‌రెడ్డి, శిరీష, సునీత పాల్గొన్నారు.

ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొన్న కంటెయినర్

ఇద్దరు ప్రయాణికుల దుర్మరణం

కొయ్యలగూడెం శివారులో ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఢీకొట్టిన కంటెయినర్

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 28 : హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై ఆగిన ట్రావెల్స్ బస్సు ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకృష్ణా ట్రావెల్స్‌కు చెందిన బస్సు శుక్రవారం అర్ధరాత్రి విజయవాడ నుంచి ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. శనివారం తెల్లవారుజామున యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం శివారుకు రాగానే బస్సు ఇంజిన్ ఓవర్ హీట్ అవడంతో డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపాడు. హైదరాబాద్ వైపు కంటెయినర్ లారీ ఒకటి వెనుక నుంచి బస్సును ఢీకొట్టడంతో అందులో కూర్చున్న ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతులు ఖమ్మం జిల్లా కారపల్లి మండలం మాడపల్లి గ్రామానికి చెందిన యజ్జు రవీందర్(24), హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఖమ్మం జిల్లా వెంసూరు మండలం వెనచేడువెంకటాపురం గ్రామానికి చెందిన పాల సతీశ్‌కుమార్(46)గా పోలీసులు గుర్తించారు. చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం చేసి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. క్షతగాత్రులకు చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి ప్రాథమిక చికిత్స అందించి హైదరాబాద్‌లోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.